వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే

సారంగాపూర్/రాయికల్, అక్టోబర్ 3: బీర్‌పూర్ లోని ఇందిరానగర్ సమీపంలో కెనాల్‌పై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా ఉండగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పూడూరి దుబ్బమ్మ, చిర్నేని నారాయణ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. చర్లపల్లి గ్రామానికి చెందిన ముక్కెర రాజన్న అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, నాయకులు నారపాక రమేశ్, మాజీ ఉప సర్పంచ్ హరీశ్, నాయకులు ఉన్నారు. రాయికల్ మండల అల్లీపూర్‌కు చెందిన కునమల్ల ప్రకాశ్ మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట ప్యాక్స్ చైర్మన్ రాజలింగం, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు ముఖీద్, ప్రవీణ్, శివకుమార్, సురేశ్, జగదీశ్, రత్నాకర్ రావు, జహంగీర్ తదితరులున్నారు.

ప్రతిభావంతులకు అభినందన

జగిత్యాల, అక్టోబర్ 3: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌కు చెందిన మ్యాదరి రేణుక కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కాగా, రేణుకను గురువారం ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 3: వేంపేటకు చెందిన మారు హైందవి మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించింది. హైందవిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గురువారం అభినందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేశ్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల, అక్టోబర్ 3: జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ వానకాలం సీజన్‌లో ధాన్యం సేకరణ, ప్రభుత్వం ప్రజలకు సన్నబియ్యం పంపిణీ విషయంలో రైస్ మిల్లర్లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సభ్యులు నవీన్ రావు, చెన్నకేశవ్, శ్రీనివాస్ రావు, మధు, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 3: భార్య ఆత్మహత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాలలోని ఎలుకబావి ప్రాంతానికి చెందిన రాపల్లి రాజేశ్‌కు నాలుగేళ్ల క్రితం పెద్దపల్లి జిల్లా ధర్మారానికి చెందిన సౌమ్య(25)తో వివాహం జరిగింది. కొద్ది రోజులుగా రాజేశ్ అదనపు కట్నం కోసం సౌమ్యను తరచూ వేధిస్తున్నాడు. ఈ క్రమంలో వేధింపులు తాళలేక సౌమ్య మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సౌమ్య తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు రాజేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

జగిత్యాలలో దుర్గాదేవీ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

పెగడపల్లి : మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

జగిత్యాలలో శివుడి వేషధారణలో చిన్నారి

దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

జగిత్యాలటౌన్/పెగడపల్లి/గొల్లపల్లి/కోరుట్ల/కథలాపూర్/ధర్మపురి/ మల్లాపూర్/ మారుతీనగర్/ మల్యాల/ కొడిమ్యాల/ సారంగాపూర్, అక్టోబర్ 3: జిల్లా వ్యాప్తంగా గురువారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు, భవానీ దీక్షాపరులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీయోగ, ఉగ్ర నారసింహస్వామి ఉత్సవమూర్తులను అశ్వ వాహనంపై ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పండితులు, అర్చకులు , తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: దుర్గాదేవీ శోభాయాత్రలో మంగళ హారతులతో భక్తులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 3 : ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్‌రావు, కేఆర్ సురేశ్ రెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో ₹5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దళితులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించగా, నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గోధూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నిధులతో ఏర్పాటు చేసిన మినీ ఫంక్షన్‌హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మరింత మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేను మాజీ ఎంపీపీ జాజాల భీమేశ్వరి, డబ్బ గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏలాల దశరథ్‌రెడ్డి, మెట్‌పల్లి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, వైస్ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు జగన్‌రావు, కంఠం రమేశ్, చిన్నారెడ్డి, నేమూరి సత్యనారాయణ, నర్సయ్య, స్వామి, మల్లయ్య, అశోక్ గౌడ్, డేవిడ్, మహిపాల్, రఘు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులను ప్రజా అవసరాలకే ఉపయోగించాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 3: ప్రభుత్వ నిధులను ప్రజలకు సదుపాయాలు కల్పించడానికే ఉపయోగించాలని, అప్పుడే నిధుల వినియోగానికి సరైన ఫలితాలుంటాయని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి నిధులు రూ. 5 లక్షలతో మెట్‌పల్లి మండలం రంగరావుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మాణం, రూ. 5 లక్షలతో మేడిపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మినీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, రూ. 5 లక్షలతో వేంపేటలో ఓపెన్‌జిమ్ నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సొంత ప్రయోజనాలకు ప్రభుత్వ నిధులను కేటాయించే నాయకులు ఎప్పటికీ ప్రజల మన్ననలు పొందరని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులను అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజలకు ఉపయోగపడే వాటికి కేటాయించినప్పుడే సద్వినియోగమవుతాయని తెలిపారు. కానీ కాంగ్రెస్ నాయకులు తమ స్వప్రయోజనాలకు కోరుట్ల మున్సిపల్ నిధులను కేటాయిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, నాయకుడు చంద్రయ్య, కార్యదర్శి అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: గోధూర్‌లో కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 3: హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, వరి సన్నరకాలకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సీజన్ నుంచి సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్ల కోసం వేర్వేరు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సన్న, దొడ్డు రకం వడ్లను గుర్తించే విషయంలో ఏఈవోలు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. అవసరమైన చోట ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం వడ్లు వేర్వేరుగా నిల్వ ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేనిచో అవకతవకలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. డీఎస్సీ అభ్యర్థులకు ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయాలన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ పరిశీలన

రాయికల్, అక్టోబర్ 3: రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్‌ను గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. గతంలో ప్రభుత్వానికి నివేదించిన మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులు చేయాలని, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని జోన్లు రూపొందించి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కొండగట్టులో తలనీలాల టెండర్ వాయిదా

మల్యాల, అక్టోబర్ 3: కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునేందుకు గానూ, ఆలయ పరిధిలో సేకరించిన కురులను ఉన్నది ఉన్నట్లుగా అమ్మేందుకు నిర్వహించిన టెండర్ ప్రక్రియను దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ రద్దు చేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సేకరించిన తలనీలాలను అమ్మేందుకు గత జూలై 24న నిర్వహించిన తలనీలాల టెండర్‌ను రద్దు చేశారన్నారు. అలాగే, గత నెల 30న నిర్వహించిన తలనీలాలు పోగు చేసుకునే హక్కును సైతం రద్దు చేసినట్లు తెలిపారు. ఈ రెండు టెండర్లను ఈనెల 17న దేవాదాయ ధర్మాధాయ శాఖ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యా సంస్థల్లో బతుకమ్మ సంబురాలు

కోరుట్ల: బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు

జగిత్యాల/కోరుట్ల, అక్టోబర్ 3: జగిత్యాలలోని రామకృష్ణ హైస్కూల్ (ఎస్ఆర్‌కే)లో, కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి విద్యా సంస్థల ఆవరణలో పెట్టి ఆడి పాడారు. రామకృష్ణ పాఠశాలలో విద్యా సంస్థల అధినేత యాద రామకృష్ణ, డైరెక్టర్ పల్లెర్ల నరేశ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్, వెంకట రమేశ్, గోపు మునీందర్ రెడ్డి, మల్లికార్జున్, పాఠశాల ప్రిన్సిపాల్ గోపు దీపిక, అధ్యాపకులు, కోరుట్ల ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ గౌసూర్ రహమాన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గంగాప్రసాద్, అధ్యాపకులు ఇమ్రాన్ ఖాన్, శ్రీనివాస్, స్వరూప, సంధ్య, నవీన, ప్రకాశిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు

కథలాపూర్, అక్టోబర్ 3: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం వరదకాలువలో గల్లంతైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా, పోలీసులు గురువారం గాలింపు చేపట్టారు. దుంపేట శివారులో నుంచి దూలూర్, బొమ్మెన, దమ్మన్నపేట, మల్యాల మండలం రాంపూర్ వరకు వరద కాలువ వెంబడి ఎస్ఐ నవీన్‌కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది గాలించారు. మరోవైపు గజ ఈతగాళ్లు వరదకాలువలో తెప్పపై వెళ్లి గాలించారు. మల్లేశం ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

కోరుట్ల రూరల్, అక్టోబర్ 3: పైడిమడుగు గ్రామంలో ఈ నెల 6న లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ, ఫ్రెండ్స్ స్టార్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛత రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు పోతని శ్రీలత గురువారం తెలిపారు. రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పోతని ప్రవీణ్‌కుమార్, మంచాల జగన్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీ జరిగేలా చూడాలని వినతి

రాయికల్, అక్టోబర్ 3: తమకు పంట రుణమాఫీ జరిగేలా చూడాలని మైతాపూర్ గ్రామానికి చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు గురువారం జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. విషయం వ్యవసాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, రఘుపతి రెడ్డి, గంప ఆనంద్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేత

మారుతీనగర్, అక్టోబర్ 3: పట్టణంలోని 26వ వార్డు కౌన్సిలర్ చర్లపల్లి లక్ష్మి-రాజేశ్వర్‌గౌడ్ దంపతులు గురువారం పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకొని దుస్తులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

మారుతీనగర్, అక్టోబర్ 3: బీసీ కుల గణన చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈనెల 9న మెట్‌పల్లి పట్టణంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు బీసీ సంఘాల జేఏసీ నాయకులు గురువారం తెలిపారు. దీక్షలో విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుప్పాల లింబాద్రి, తుల రాజేందర్, రాంబాబు, నల్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

యునానీ వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి, అక్టోబర్ 3: కమలాపూర్ గ్రామంలో గురువారం ధర్మపురి యునానీ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 55 ఏళ్లపై బడిన వృద్ధులకు వివిధ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యునానీ వైద్యాధికారి సమీన ఖాన్మీ, డీపీఎం శివకుమార్, ఫార్మసిస్టు సాబీర్, ఎంఎన్‌వో రహమత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 3: స్థానిక జంబి గద్దె వద్ద దేవీ శరన్నవరాత్రోత్సవాలకు చేపడుతున్న ఏర్పాట్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ పరిశీలించారు. పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు పల్లపు రేణుక-మొగిలి, నవీన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు

కోరుట్ల రూరల్, అక్టోబర్ 3: అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. సర్పరాజ్‌పల్లెలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గురువారం ఆయన సర్వేను ప్రారంభించారు. ఎంపీవో కృపాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల టౌన్, అక్టోబర్ 3: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు ఎంపికైనట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, విద్యార్థులు రాఘవ్, సాకేత్, వరుణ్, అమాన్‌పాషా, సాయిమణి, స్వరాళి, మనస్వి, హంసిక, రాంచరణ్, శివ, తేజస్విని, జైద్‌ను పలువురు అభినందించారు.

ప్రతిభావంతుడికి సత్కారం

వెల్గటూర్, అక్టోబర్ 3: ఎండపల్లి మండలం కొత్తపేటకు చెందిన కుశనపల్లి ప్రసాద్ డీఎస్సీలో జిల్లా స్థాయిలో 105వ ర్యాంక్ రాగా, ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రసాద్‌ను జీఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహేందర్ రెడ్డి శాలువాతో సత్కరించారు.

ప్రసాద్‌ను సన్మానిస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్ బాధ్యుడు మహేందర్‌రెడ్డి

అన్నను హత్య చేసిన తమ్ముడి అరెస్టు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 3: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో నన్నపునేని విద్యాసాగర్ రాజు(35)ను హత్య చేసిన తమ్ముడు నన్నపునేని విక్రమ్‌రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో వివరాలు వెల్లడించారు. నన్నపునేని విద్యాసాగర్‌ను తన తమ్ముడు విక్రమ్ రాజు భూతగాదాల నేపథ్యంలో మంగళవారం రోకలి బండతో కొట్టగా అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందుతుడి కోసం గాలింపు చేపట్టామన్నారు. బుధవారం మధ్యాహ్న సమయంలో విక్రమ్ రాజును అంతర్గాం శివారులో జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి చాకచక్యంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు ఇంటి వద్ద దాచిపెట్టిన రోకలి బండను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గురువారం నిందితుడిని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్‌ను డీఎస్పీ అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 3: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో గురువారం ఆయన జగిత్యాల పట్టణంతో పాటు అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 149 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 97 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల డబుల్ బెడ్రూం ఇండ్లల్లో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, తహసీల్దార్లు రామ్మోహన్, శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

సారంగాపూర్, అక్టోబర్ 3: క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన విలేజ్ టూ విలేజ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. చనిపోయిన యువకుల స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మసర్తి రమేశ్, గుడిసె శ్రీమతి-జితేందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ పాత పద్మ-రమేశ్, కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు, కుంటల భూములను సంరక్షించాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 3: గ్రామంలోని చెరువు, కుంటల భూములను సంరక్షించాలని ఆత్మకూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తహల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, నాయకులు నేరెళ్ల శ్రీధర్, చిలివేరి దిలీప్‌గౌడ్, గడ్డం చంద్రశేఖర్, చౌట్‌పల్లి మున్నా, బండ రాజు, మైస రమేశ్ పాల్గొన్నారు.

రత్నాకర్‌రావు విగ్రహావిష్కరణకు తరలిరావాలి

కోరుట్ల, అక్టోబర్ 3: పట్టణ శివారులోని పీవీ నరసింహరావు పశు వైద్య కళాశాల సమీపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం స్థానిక ముక్కాస్ ఫంక్షన్ హాల్‌లో మంత్రులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల అధికారులతో సమావేశం

కథలాపూర్, అక్టోబర్ 3: కథలాపూర్ రైతు వేదికలో కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల అధికారులతో శుక్రవారం ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మూడు మండలాల అధికారులు ప్రగతి నివేదికలతో హాజర